

అర్చకులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అర్చకులకు ఆర్థిక సహాయం అందజేత

గోల్నాక, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అర్చకులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆర్థిక సహాయం అందజేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఆలయాల్లో పురోహితులుగా పనిచేస్తున్న 11 మంది అర్చకులకు సోమవారం గోల్నాక తులసనగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున అందజేశారు. ఐదేళ్ల నుంచి పురోహితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈ. విజయకుమార్‌గౌడ్, బి. పద్మావెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న పదిమందికి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సోమవారం అందజేశారు. పదిమందికి రూ. 3.82 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయి.



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి

బాగ్‌అంబర్‌పేటలో సమస్యలను పరిష్కరించాలి

నల్లకుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి సూచించారు. సోమవారం డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, పార్కులో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ డీపీఎస్ పేర్రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, మాజీ కార్పొరేటర్ బి. వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద ఏర్పాట్లు చేయండి

కవాడిగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగను పురస్కరించుకొని కవాడిగూడ డివిజన్‌లో అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కార్పొరేటర్ జి. రచనశ్రీ సూచించారు. సోమవారం జ్యోతినగర్‌లోని రత్నాల మైసమ్మ ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఆలయానికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, రోడ్లపై గుంతలను పూడ్చాలని, వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, కె. పరిమళ్‌కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభాకర్, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతినగర్‌లో ఆలయానికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను చూపిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

శాంతియువజన సంఘం బస్తీలో

దవాఖానా ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ శాంతి యువజన సంఘం బస్తీలో దవాఖనా ఏర్పాటు చేయాలని సంఘం సభ్యులు ఈ. సాయి, ఎన్. పెంటయ్య, ఎస్. రాజు, వేణుగోపాల్, శివకుమార్, జె. బాబురావు కోరారు. సోమవారం వారు బస్తీలో మాట్లాడారు. బస్తీలో దవాఖానా ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు గౌతమ్‌రావు తదితరులు

బీసీలను మోసం చేసిన ప్రభుత్వం : బీజేపీ

అంబర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను 6 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి బీసీలను వంచిందని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతలు ధర్నా నిర్వహించారు. ధర్నాలో కార్పొరేటర్ అమృత, బీజేపీ నేతలు దాసోజు నాగభూషణంచారి, మైలారం రాజు, యశ్వంత్, ఏడెల్లి అజయ్‌కుమార్, చుక్క జగన్, కృష్ణ ముదిరాజ్, వెంకటస్వామిగౌడ్ పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మైలారం రాజు తదితరులు

అనస్థీషియా టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలి

అంబర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన అనస్థీషియా ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అనస్థీషియా ఓటీ టెక్నీషియన్ సంఘం నేతలు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మైలారం రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో డిప్లొమా చేసిన అనస్థీషియా ఓటీ టెక్నీషియన్లు కార్పొరేట్, చిన్న చిన్న ఆస్పత్రులలో తక్కువ జీతాలకే పనిచేస్తున్నారని తెలిపారు. వారికి హెల్త్ ఇన్సూరెన్స్‌తోపాటు ఆరోగ్యభద్రత కల్పించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు నాగరాజు, భిక్షపతి, బాబురావు, రాజేష్ తదితరులు ఉన్నారు.

లలితా విష్ణు వైభవం నిత్యపారాయణ గ్రంథం ఆవిష్కరణ

చిక్కడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పురాణపండ శ్రీనివాస్ రచించిన లలితా విష్ణు వైభవం నిత్యపారాయణం గ్రంథావిష్కరణ సభ త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. లలితా విష్ణు వైభవం నిత్యపారాయణ గ్రంథం ప్రతీ ఇంట్లో ఉండాల్సిన గ్రంథమని అన్నారు.

గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. లలితా విష్ణు వైభవం గ్రంథాన్ని ముషీరాబాద్ వద్దనున్న శృంగేరి సరస్వతి దేవాలయ భక్తులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ దీక్ష



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శివరాత్రి అయిలు మల్లు

కవాడిగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివరాత్రి అయిలు మల్లు డిమాండ్ చేశారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో దీక్ష చేశారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న అయిలు మల్లు మాట్లాడుతూ.. వడ్డెర కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో వెయ్యికోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. వడ్డెరలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అసెంబ్లీ, సీఎం కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. దీక్షా శిబిరంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, ఉపాధ్యక్షుడు పి. మల్లేష్, కార్యదర్శి పి. గండయ్య, వడ్డె ఓబన్న, వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య పాల్గొని దీక్షకు మద్దతు ప్రకటించారు. వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శులు ఎత్తరి గణేష్, వరికుప్పల వెంకటేష్, వైస్ చైర్మన్ దేవరాజు. కోశాధికారి జి. కుమార్, ఉపాధ్యక్షులు ఎస్ఎస్ శ్రీనివాస్, పి. గురువయ్య, రాష్ట్ర కార్యదర్శులు తిరుపతి, మల్లేష్, శ్రీనివాస్, పలు జిల్లాల నాయకులు హాజరయ్యారు.

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సినారె పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన మహనీయులను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. సోమవారం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి 93వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు డా.సినారె పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి లక్ష్మీప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. సినారె పురస్కారాన్ని ఆచార్య యార్లగడ్డకు అందజేయడం సముచితమైన నిర్ణయమని అన్నారు. తెలుగు భాష, సాంస్కృతిక వ్యాప్తికి సినారె, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

భగత్‌సింగ్‌నగర్ బస్తీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్‌నగర్ బస్తీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు కె. రమేష్, ఆర్. వెంకటేష్, వి.విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ధర్నా చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్ బస్తీవాసులు 25 ఏళ్లుగా గుడిసెల్లోనే నివసిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు తమ బతుకులు మారతాయని ఆశగా ఎదురుచూస్తున్నారని, వారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడన్నారు. బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భగత్‌సింగ్‌నగర్ బస్తీ వాసులు

గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రాంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గౌడ కులస్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలో సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరుతో జనగామ జిల్లాను ఏర్పాటు చేసి గెజిట్ విడుదల చేయాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేసి అధికారికంగా ఆయన జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహించాలని, మద్యం షాపులు, బార్ల కేటాయింపులో గౌడ కులస్థులకు 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న హామీని అమలు చేయాలని, 50 సంవత్సరాలు పై బడిన గీత వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి

రాంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచీకరణతో సాంకేతిక రంగంలో వస్తున్న నూతన పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ సూచించారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. విజ్ఞానాన్ని ఇతరులకు పంచాలన్నారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ఎం. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, ఆ దిశగా విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డిని ఎం. శ్రీనివాస్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త శైలజ, రామకృష్ణమఠం ప్రతినిధి బ్రహ్మచారి సత్య చైతన్య స్వామీజీ, అవంతి విద్యా సంస్థల అధ్యక్షుడు ఎం. జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంక, ఉపాధ్యక్షులు ఎం. వి. ఎస్. ఎస్. నదీష్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, డైరెక్టర్ డి. వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరసోమయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్

నిధులు మంజూరైనా..

ప్రారంభంకాని రోడ్డు నిర్మాణ పనులు

ముషీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడం లేదని మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ అన్నారు. సోమవారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ.. రంగానగర్ కమ్యూనిటీ హాల్ నుంచి పద్మశాలి కాలనీ వరకు, తాజీర్‌నగర్, గుల్షన్‌నగర్, ఇందిరానగర్, మండీగల్లీ, సిద్దిక్‌నగర్, బంగాదేశ్ మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ ఖరీం, మహ్మద్ ఇమ్రాన్, షారూక్‌ఖాన్ పాల్గొన్నారు.

దాశరథి స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలి



దాశరథికి నివాళులర్పిస్తున్న ఆనందాచారి తదితరులు

రాంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచార్య స్మారక కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఆనందాచారి అన్నారు. సోమవారం ఎంహెచ్ భవన్‌లో దాశరథి శతజయంతి ప్రారంభ సభ అనంతోజు మోహన్‌కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ.. ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సుధా భాస్కర్, రమేష్, శాంతారావు, అజయ్, ఏలేందర్, శివ పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి తాపీ మేస్త్రీ మృతి

బర్కత్‌పుర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వచ్చి తాపీ మేస్త్రీ మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. విశాఖపట్టణానికి చెందిన సత్యనారాయణ (50) అనారోగ్యానికి గురవడంతో వైద్యం కోసం నగరానికి వచ్చాడు. సోమవారం తిరిగి విశాఖపట్టణం వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు.

ప్లాట్‌ఫారం 4 వద్ద తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.



చండీహోమంలో భక్తులు

ఘనంగా వరాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

చిక్కడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్‌లోని వరాల పోచమ్మ దేవాలయం ఏడో వార్షికోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ఎ. కనకరాజు, చైర్మన్ నిరంజన్, కోశాధికారి బి. శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి ఎస్. ఏసురత్నం పర్యవేక్షణలో గణపతి పూజ, చండీహోమం, కుంకుమార్చన, దుర్గాహోమం జరిగాయి. బుధవారం వరకు వేడుకలు జరుగుతాయన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ముషీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాల మాట్లాడుతూ.. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదతర వ్యాధులు వస్తాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మలేరియా విభాగం సిబ్బంది దోమల మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయ, జీహెచ్‌ఎంసీ సీనియర్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు

ముషీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహాకాళి అమ్మవారి ఘటం ఊరేగింపును సోమవారం వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు మాట్లాడుతూ.. అమ్మవారి ఘటాన్ని ఈ నెల 28 వరకు పురవీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన అర్చకుడు వై.చంద్రమౌళి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు రెబ్బరామారావు, సంగిశెట్టి రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు డి. శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, రాజు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పూరి నందు, కాంగ్రెస్ నాయకుడు పట్నం నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు.

'మూసీ' నిధులను

'ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కేటాయించాలి'

బర్కత్‌పుర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధికి లక్షా 70 వేల కోట్ల రూపాయలను కేటాయించడం దుర్మార్గమని, ఈ నిధులను ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కేటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ డిమాండ్ చేశారు. బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి తాత్విక దృక్పథం, సమన్వయం, దూరదృష్టి, పరిపాలన నిపుణత, మానవీయ కోణం లేదని దుయ్యబట్టారు. మూసీకి కేటాయించే నిధులను సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పదేళ్ల ఖర్చు పెడితే కోట్ల మంది అణగారిన వర్గాల విద్యార్థుల జీవితాలు బాగుపడతాయన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు : ఎంకే రాము

చిక్కడపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్య ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జవహర్ బాలభవన్ మాజీ డైరెక్టర్ ఎంకే రాము అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సిటీ కల్చరల్ సెంటర్‌లో తెలంగాణ కళా జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగీత, నృత్యగురువులకు సన్మానం, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాపీఠం, కళాసంస్థల చిన్నారులకు అభినందన సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు, నిర్వాహకులు పద్మావెంకటేష్ మణిరత్నం, గాయత్రి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



రామును సన్మానిస్తున్న త్రినాథరావు, పద్మావెంకటేశ్ తదితరులు

తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్

రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎట్టయ్య



బర్కత్‌పుర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గద్దగూటి ఎట్టయ్య ముదిరాజ్ నియమితులయ్యారు. సోమవారం బర్కత్‌పురలోని సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎట్టయ్య ముదిరాజ్ మాట్లాడుతూ.. సిటిజన్స్ కౌన్సిల్‌ను పటిష్ఠం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

రాంనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేసి అఖిల పక్షాన్ని ఢిల్లీకి పంపాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ తొలితరం ఉద్యమనాయకురాలు సదాలక్ష్మీ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, కె. వెంకట్, చందు, రాజేష్, ధర్మారావు, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

కన్నడ నాట్యరంగ కార్యవర్గం

బర్కత్‌పుర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కన్నడ నాట్యరంగ కార్యవర్గాన్ని బర్కత్‌పుర కర్ణాటక సాహిత్య మందిర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. కృష్ణమూర్తి, కార్యదర్శిగా రామచంద్ర దిగ్గి, కోశాధికారిగా వి. రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా రత్నాకర్ రాయ్, సుమతి నిరంజన్, సంయుక్త కార్యదర్శిగా పి. హరీష్, చీఫ్ లైజన్ ఆఫీసర్‌గా విఠల్ జోషి, న్యాయ సలహాదారుడిగా గోపాలకృష్ణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు బీఆర్ రావు, శ్రీధర్‌రావు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా నిరంజన్‌రావు, రామ్మూర్తి, రమేష్‌బాబు, సత్యనారాయణ, ప్రసన్నకుమార్, హరీష్, పద్మ, పరిమళజ్యోతి, జయరాంశెట్టి, కృష్ణమూర్తి, రాఘవేందర్‌రావు, కె.ఎం. బలాల్, ప్రోగ్రామ్ కార్యదర్శిగా రమా గోపాలకృష్ణను ఎన్నుకున్నారని పేర్కొన్నారు.



బజరంగ్ సేనలో చేరిన రెజ్లింగ్ క్రీడాకారుడు రూప్‌లాల్

భజరంగ్ సేనలో చేరిన రెజ్లింగ్ క్రీడాకారుడు రూప్‌లాల్

బర్కత్‌పుర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రెజ్లింగ్ ప్రముఖ క్రీడాకారుడు రూప్‌లాల్ బజరంగ్ సేనలో సోమవారం చేరాడు. ఈ సందర్భంగా బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గోవును జాతీయ జంతువుగా ప్రకటించి గోవధను నిషేధించాలని డిమాండ్ చేశారు. గోవులను సంరక్షించడానికి గోశాలలను ఏర్పాటు చేయడానికి తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బజరంగ్ సేన ప్రధాన కార్యదర్శి ఠాకూర్ వికాస్ సింగ్, ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ప్రవీణ్‌యాదవ్, కరణ్‌సూర్యవంశీ, నరేష్, దీపక్, అభిషేక్, వీరూ తదితరులు పాల్గొన్నారు.

పూసగోపాల్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పూస గోపాల్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం గంగపుత్ర కాలనీలో నిర్వహించిన పూస గోపాల్ సంతాప సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికుల శ్రేయస్సు, బీఆర్‌ఎస్ బలోపేతానికి ఆయన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రుణం ఇప్పిస్తామని మోసం

- నలుగురు సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- నిందితులపై దేశవ్యాప్తంగా 425 కేసులు

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): లోన్ ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన మనీష్‌కుమార్(24), ఆకాష్ కుమార్(24), కుందన్‌కుమార్(28), తెలంగాణకు చెందిన వెంకటేష్ మాన్‌జీ రాథోడ్(21) ముఠాగా ఏర్పడి ప్రముఖ రుణ సంస్థల ప్రతినిధులమంటూ తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. రుణం కావాలని సంప్రదించిన వారి నుంచి జీఎస్‌టీ, ఎన్‌ఓసీ, పెనాల్టీ పేరుతో అందినకాడికి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. ధనీ ఇన్‌స్టంట్ పర్సనల్ లోన్ సంస్థలో పనిచేస్తున్నామంటూ బహదూర్‌పురాకు చెందిన వ్యక్తికి రుణం ఇప్పిస్తామని నమ్మించారు. బాధితుడు రూ.2 లక్షల రుణం కావాలని కోరగా.. అతడి నుంచి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్‌టీ, టీడీఎస్, ఎస్‌జీఎస్‌టీ, లేట్ పెనాల్టీ, క్లియరెన్స్, ఎన్‌ఓసీ, చెక్ క్లియరెన్స్ చార్జీలు, రీఫండబుల్ అమౌంట్ పేరుతో పలు దఫాలుగా బాధితుడి నుంచి రూ. 1,20,340 వసూలు చేశారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించలేదు. మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి ఆధ్వర్యంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ కె.సతీష్‌రెడ్డి బృందం ఢిల్లీ వెళ్లి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై దేశవ్యాప్తంగా 401, తెలంగాణలో 24 కేసులు నమోదయ్యాయని సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి తెలిపారు.